వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

30లోగా భూ హక్కు పత్రాలు పంపిణీ

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాలను ఈనెల 30వ తేదీ లోపు పంపిణీ చేస్తామని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. గురువారం రాష్ట్ర పరిపాలన ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్‌పై విధంగా తెలిపారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ రీ సర్వే పూర్తిచేసిన గ్రామాల రైతులకు పెండింగ్‌లో ఉన్న భూపత్రాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. తదనంతరం రీ సర్వే చేసిన భూములకు భూహక్కు పత్రాలు ప్రింటింగ్‌కు పంపించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సర్వే రాళ్లు నాటే ప్రక్రియ నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఈ ప్రక్రియ 10వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల వైసిపి పాలనలో..

రాష్ట్రం సర్వనాశనం

- అన్ని విధాలా ప్రజలపై భారాలు
- రూ.10 ఇచ్చి రూ.100 దోచుకుంటున్నారు..!
- జగన్‌ను ఇంటికి పంపితేనే రాష్ట్రాభివృద్ధి
- నారా చంద్రబాబు నాయుడు
- అనంతలో ముగిసిన బాబు పర్యటన

గుత్తిలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్ని టిడిపి శ్రేణులు, మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

కళ్యాణదుర్గంలో రైతులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం, గుత్తి

నాలుగేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో రైతాంగం సర్వనాశనం అయ్యిందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం కళ్యాణదుర్గం శ్రీనివాస కళ్యాణమండపంలో 'రైతు సంక్షోభం-ప్రజావేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో చంద్రబాబు ముఖాముఖి మాట్లాడారు. టీడీపీ పాలనలో రైతులకు అందజేసిన సబ్సీడీ పథకాలు ప్రస్తుత సీఎం జగన్‌రెడ్డి దుర్మార్గపు పాలనలో రైతుల కష్టాలపై చర్చించారు. ప్రస్తుత వ్యవసాయంలో పడుతున్న ఇబ్బందులను స్థానిక రైతులు చంద్రబాబుకు వివరించారు. గతంలో 10 ఎకరాలు ఉన్న ప్రతిరైతుకూ 90శాతం సబ్సీడీతో బిందు, తుంపర సేద్యం పరికరాలు విరివిగా అందాయని, ప్రస్తుతం ఇలాంటి పథకాలు లేవన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రతి ఏడాదీ పంటనష్టపరిహారంతో పాటు ఇన్‌పుట్‌సబ్సీడీ, ఇన్సూరెన్స్ తూచా తప్పకుండా అందేదన్నారు. నాలుగున్నరేళ్ల గడుస్తున్నా అతివృష్టి, అనావృష్టి కారణంగా తాము సాగుచేసిన వేరుశనగ, కంది, టమోటా, మామిడి, బొప్పాయి, మిరప తదితర పంటలకు పరిహారం అందలేదని రైతులు చంద్రబాబు ఎదుటే ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, ఉద్యాన సాగులో ఏఒక్కస్కీం కూడా లేకుండా చేశారని ఆక్రోశాన్ని వెల్లగక్కారు. ప్రస్తుత పాలనతో సంక్షేమ పథకాల ఊసే లేదని ఎర్రంపల్లి, పాలవాయి, ముద్దినాయనపల్లి, ముదిగల్లు, ఒంటిమిద్ది, ముప్పలకుంట తదితర గ్రామాల రైతులు వాపోయారు. అనంతపురం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ జిల్లా నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతున్నప్పటికీ ఈ ప్రాంత రైతులు, ప్రజలను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వ పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ఇప్పటికైనా రైతులు మేల్కొని దుర్మార్గపు పాలనను సాగనంపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడుతో పాటు రైతులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపద సష్టించి.. ఆదాయాన్ని పెంచుతాం

గుత్తి : రాష్ట్రంలో సంపదను సష్టించి ఆదాయాన్ని పెంచి ప్రజలకు పంచుతామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం గుత్తికి వచ్చారు. ముందుగా పట్టణ శివారులో అసంతృప్తిగా నిలిచిపోయిన మీడ్ పెన్నార్ తాగునీటి ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. అక్కడ చంద్రబాబు సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ప్రజలే నాకు బలం ప్రజలే నా సైన్యం అన్నారు. నాలుగున్నర సంవత్సరాల్లో సైకో పాలనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నిత్యావసర వస్తువులు, పెట్రో విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం పెంచింది అన్నారు. ప్రజలకి జగన్ రూ.10 ఇచ్చి రూ.100 దోచుకుంటున్నాడని ఆరోపించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతానన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమ ఏర్పాటు చేసి ఎందరికో ఉపాధి కల్పించామన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.69 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. అరాచక ప్రభుత్వం ఎంతో చరిత్ర గల గుత్తి చెరువుకు సాగునీరు అందించలేకపోతుందన్నారు. జిల్లాలోని అన్ని చెరువులు, ప్రతి ఎకరానికీ సాగునీరు అందిస్తామన్నారు. గుత్తి మున్సిపాలిటీలో శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రూ.173 కోట్లతో తాము మిడ్ పెన్నార్ ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తే మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన వైసిపి ప్రభుత్వం నాలుగున్నర ఏళ్ల గడిచినా పూర్తి చేయలేక పోయిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం ప్రతి ఇంటికీ తాగునీటిని ఉచితంగా అందిస్తామన్నారు. తమ హయాంలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసే వారమన్నారు. అదనంగా విద్యుత్తును ఉత్పత్తి చేసి వినియోగాన్ని పెంచే వారమన్నారు. తాము ఐటి ఉద్యోగం ఇస్తే జగన్ వాలంటరీ ఉద్యోగం ఇచ్చాడని ఎద్దేవా చేశారు. రైతును రాజు చేసే బాధ్యత తమపై ఉందన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే సోదరులుచ బంధువులు ఆరు మంది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా ఉన్నారని వారందరూ దోపిడీకి పాల్పడుతున్నారని చెప్పారు. బేడ బుడగ జంగాల సామాజిక వర్గయులకు కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం సైకో జగన్‌ని ఇంటికి పంపి టిడిపికి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.జితేంద్ర గౌడ్, ప్రభాకర్ చౌదరి, జెసి.ప్రభాకర్ రెడ్డి, టిడిపి నాయకులు వెంకటశివుడు యాదవ్, జీవానంద రెడ్డి, కేసీ.హరి, మండల, పట్టణ కన్వీనర్లు బర్దీవలి, రవిశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా జాతీయ రహదారుల విస్తరణ పనులు

జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆర్డీవోలతో సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

జిల్లాలో జాతీయ రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో జాతీయ రహదారుల విస్తరణ పనులపై ఆర్డీవోలు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అభివద్ధికి ప్రధానమైన మౌలిక వసతుల కల్పనలో జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణంలో పురోగతిలో ఉండాలన్నారు. జిల్లాలో ఇప్పటికే రోడ్ల విస్తరణకై 12వేల ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయించగా, ఇందులో 8000 ఎకరాల భూమిని సేకరించినట్లు చెప్పారు. మిగిలిన భూమిని త్వరగతిన సేకరించాలని ఆర్డీవోలను ఆదేశించారు. జిల్లాలో బి.కొత్తపల్లి నుంచి గోరంట్ల, ముదిగుబ్బ బైపాస్, కదిరి బైపాస్, కైలాపల్లి ఆర్ఒబి బెంగళూరు వయా కడప హిందూపురం పుట్టపర్తి కలిసే జాతీయ రహదారుల కొరకు తరగతిన భూ సేకరణ చేయాలన్నారు. ఎక్కడైనా అభ్యంతరాలు వస్తే ఆర్డీవోలు భూ పరిహార సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలన్నారు. కాంట్రాక్టర్లు, ఎన్‌హెచ్ అధికారులు రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి ముందుకు వెళ్లాలని ఆదేశించారు. రైతులకు భూ పరిహారం అందరిని వారిని గుర్తించి పరిహారం అందే విధంగా తాసిల్దార్లు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఈ జగదీష్ గుప్తా, గిడ్డయ్య, ఆర్డీవోలు రాఘవేంద్ర, తిప్పేనాయక్, భాగ్యరేఖ పాల్గొన్నారు.

సమగ్ర ఓటరు జాబితాను తయారు చేద్దాం

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డిఆర్ఒ కొండయ్య

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలని డిఆర్ఒ పి.కొండయ్య రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని డిఆర్ఒ ఛాంబర్లో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ తొలగించిన ఓటర్లకు సజావుగా నోటీసులు పంపించే ప్రక్రియ సాగుతోందన్నారు. మతి చెందిన ఓటర్లకు సంబంధించి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పొందడం లేదా పంచనామా నిర్వహించి ఓట్లను తొలగించడం ఆన్లైన్ ద్వారా చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇంటింటా పరిశీలన, పున్నపరిశీలన కార్యక్రమం విజయవంతం అయిందని తెలిపారు. 1.11.22వ తేదీ నుంచి 6-9-23వ తేదీ వరకు వచ్చిన ఫారం 6,7,8, ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమంలో తొలగింపునకు చేసిన దరఖాస్తులు 4,174 ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాక

పెనుకొండ నియోజకవర్గంపై సమీక్ష

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక, ఉపాధి, ఫ్యాక్టరీస్ శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం శుక్రవారం నాడు పుట్టపర్తికి రానున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్లోని స్పందన సమావేశం మందిరంలో పెనుగొండ శాసనసభ నియోజకవర్గ అభివద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం జిల్లా స్థాయి సాగునీటి సలహా మండలి సమావేశంలోనూ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్మన్ గిరిజమ్మతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

నేరాల అదుపునకు చర్యలు : డిఐజి

ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురం రేంజ్ వ్యాప్తంగా నేరాల అదుపుకు తగిన చర్యలు తీసుకుంటున్నామనిడిఐజి అమ్మిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి హిందూపురం పట్టణంలో ఆయన పర్యటించారు. అనంతరం వన్ టౌన్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. నేరాలలను అదుపు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. హైవే రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి త్వరలో వన్ స్టిక్కర్ వన్ లైఫ్ కార్యక్రమం చేపడుతామన్నారు. స్టేషన్‌లో సివిల్ పంచాయితీలు చేసిన, సిబ్బంది అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చోరీలకు అడ్డుకట్ట వేయడానికి పోలీస్ విజిలింగ్ కార్యక్రమం చేపడుతామన్నారు. ద్విచక్ర వాహనాల చోరిల్లో స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కట్టడం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు తప్పని సరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి కంజాక్షన్, సిఐలు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ లో ఈ నెల9,10 తేదీలలో రెండు రోజులు పాటు జరిగే సిఐటియు జిల్లా వర్క్ షాపు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ కోరారు. గురువారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమేష్ మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలోనికార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకత్వంతో భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సత్య సాయి జిల్లాలో కార్మికలు సమస్యలపై ఆందోళనలు నిర్వహించడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై రెండు రోజులు పాటు నిర్వహిస్తున్న వర్క్ షాప్‌లో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నారని చెప్పారు. జిల్లా వర్క్ షాప్ ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, బావమ్మ, తిప్పన్న, మహబూబ్‌బాషా, రాజు, రావు, వజ్రం నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

కార్పొరేట్ల సేవలో తరిస్తున్న బిజెపి

సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరా రెడ్డి

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

నాడు ఆర్‌ఎస్ఎస్ ఈస్ట్ ఇండియా కంపెనీకి కొమ్ము కాస్తుంటే...నేడు కేంద్రంలో ఉన్నా ఆర్‌ఎస్ఎస్ కనుపన్నల్లో ఉన్నా మతతత్వ బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు కొమ్ము కాస్తోందనిసిడబ్యూసి మెంబర్ రఘువీరా రెడ్డి విమర్శించారు. భారత్ జోడో యాత్రకు సంఘీ బావంగా గురువారం సేవామందిర్ నుంచి హిందూపురం వరకు సంఘీ బావ యాత్రను చేపట్టారు. పట్టణంలోని మహాత్మాగాంధీ అంబేద్కర్, నెహ్రు, ఇందిరా గాంధీ విగ్రహాలకు పూల మాలలు వేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సుధాకర్ అధ్యక్షత ఇందిరా గాంధీ సర్కిల్‌లో జరిగిన బహిరంగ సభలో రఘువీరారెడ్డి మాట్లాడుతు దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ ఏడాది క్రితం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేపట్టారన్నారు. కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లాలో ఎన్నికల సమయంలో ఎదో అన్నారని బిజెపి ప్రభుత్వం గుజరాత్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యేతో కేసు వేయించి, కోర్టులను సైతం తపుకపదోవ పట్టించి రాహుల్ గాంధీకి శిక్షను వేయడంతో పాటు ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని సైతం రద్దు చేయించిందని విమర్శించారు. అయితే బిజెపి ఎంపి భారత మహిళా రెజ్లర్‌లను లైంగికంగా వేదిస్తున్నారనిఢిల్లీ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కనీసం కేసు కూడా నమోదు చేయలేదన్నారు. బిజెపి దేశంలో మత విద్వేషాలను రేపుతో ప్రభుత్వాలను కూల్చడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తే అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రవేటు పరం అవుతాయన్నారు. మణిపూర్‌లో ఉన్నా ఖనిజాలను కాజేయడానికి కూకీలు, మైతీల మధ్య విద్వేషాలను సృష్టించారనిదీనిపై ప్రదాని నోరు మెదపలేదని అన్నారు. దీన్ని దేశం మొత్తం ఖండిస్తున్నప్పటికి రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేనలు మాత్రం ఒక్క మాట మాట్లాడడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఈ పార్టీలకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్టే అన్నారు. దేశం కోసం అన్ని పార్టీలు కలిసి ఇండియాగా కలిసి ముందుకు వస్తున్నాయన్నారు. అయితే రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేనలు మాత్రం ఢిల్లీకి వెళ్లి గులాములు అవుతున్నాయని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో బిజెపికి, వీరికి వంతే పాడుతున్న వారికి తగిన బుద్ది చెప్పాలన్నారు. ఈసందర్బంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి రఘువీరారెడ్డి పార్టీ కండువా వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోటాసత్యం, బాలాజీ మనోహర్, కెటీ శ్రీధర్, ప్రభాకర్ రెడ్డి, ఇలియాజ్, హరిత, శ్యాం, రఫూఫ్, అమానూల్లా పాల్గొన్నారు.

డీజిల్ బంకుల అక్రమాలపై నిగ్గు తేల్చాలి

సబ్ కలెక్టర్‌కు సిపిఎం వినతి

సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

సత్యసాయి జిల్లాలో హిందూపురం,ధర్మవరం పెనుకొండ కు సంబంధించిన పలువురు డీజిల్ బంకు యాజమాన్యాలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడానికి సహకరిస్తున్న ప్రభుత్వ అధికారుల అవినీతి నిగ్గు తేల్చాలని సిపిఎం మండల కార్యదర్శి రమష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు గురువారం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురానికి సంబంధించిన డీజిల్ బంకు పాండురంగ రవి ఎంటర్ప్రైజెస్ డీజిల్ బంకు ద్వారా దాదాపుగా 12.38 లక్షల లీటర్లు కొనుగోలు చేసినట్లు బిల్లులు చూపించారని ఇందులో ఒరిజినల్ బిల్లులు 2, 12 లక్షలు లీటర్స్ మాత్రమే ఉన్నాయన్నారు. మిగిలిన 10.26 లక్షలు లీటర్లకు నకిలీ బిల్లు సమర్పించడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని విమర్శించారు. అదేవిధంగా సాయి హితేష్ ఎంటర్‌ప్రైజెస్ 5.32 లక్షల డీజిల్ కొనుగోలు చేసినట్లు బిల్లులు చూపించారని ఇందులో ఒరిజినల్ బిల్లులు 1,10 లీటర్లు మాత్రమే అని మిగిలిన 4.26 లక్షలు లీటర్స్ నకిలీ బిల్లు సమర్పించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని విమర్శించారు. పెనుకొండకు సంబంధించిన శ్రీ సాయి కిసాన్ డీజిల్ బంక్ వారు 31.43 వేల లీటర్స్ కొనుగోలు చేసినట్లు బిల్లులు చూపించారన్నారు. ఇందులో ఒరిజినల్ పిల్లలు 2.56 వేల లీటర్స్ మాత్రమే అని మిగిలిన 28.27 లక్షల లీటర్ల డీజిల్ నకిలీ బిల్లులు సమర్పించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని తమకు ఉన్న సమాచారం అని అన్నారు. ఈ డీజిల్ బంకుల యజమానుల ప్రభుత్వ అధికారులు సహకారంతో 52.95 లక్షల లీటర్లు కొనుగోలు చేసినట్లు చూపించి ఇందులో 7.4 లక్షల లీటర్లకు ఒరిజినల్ సమర్పించి 45.97 లక్షల లీటర్స్ నకిలీ బిల్లు సమర్పించి సుమారు వంద కోట్ల రూపాయల స్కామ్‌కు పాల్పడ్డారని విమర్శించారు. ఈ అవినీతిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిప్పన్న, గంగాధర్, వెంకటరాముడు, మహబూబ్ బాషా, నాగప్ప, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్లు తాగిన బాధితులు

కల్తీ కల్లు తాగి 32 మందికి అస్వస్థత

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ మండల పరిధిలోని నాగలూరు, బండపల్లి గ్రామాలకు చెందిన 32 మంది కల్తీకల్లు తాగి అస్వస్థతకు గురైన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని నాగలూరు, బండపల్లి గ్రామాలకు చెందిన 32 మంది బుధవారం రాత్రి నాగలూరు గ్రామంలో కల్లు తాగారు. గురువారం ఉదయానికి వీరంతా వాంతులు విరేచనాలతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు వారిని చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుడు క్రాంతి ఆధ్వర్యంలో చికిత్సలు అందించారు. వీరిలో ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చికిత్సలు అందించి చాలా మందిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. కల్లు తాగి అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వైసిపి మండల కన్వీనర్ నాగులూరు బాబు, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి రమేష్, టీడీపీ నాయకులు నాగరాజు, అదిశేషు తదితరులు బాధితులను పెనుకొండ ఆసుపత్రిలో పరామర్శించారు. కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్య అందించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తిక్‌ను కెవిపిఎస్, ఎమ్మార్పీఎస్, వ్యకాసం నాయకులు కోరారు. సబ్ కలెక్టర్ స్పందిస్తూ విషయం తెలియగానే వైద్యశాఖ ఆధ్వర్యంలో బాధితులకు మెరుగైన వైద్యం అందించడానికి ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, రామాంజి, నరహరి, వజ్రం నాగప్ప పాల్గొన్నారు.

కరాటేపోటీల్లో 'బ్లూ మూన్' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - కదిరి టౌన్

జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ మేరకు కర్నూల్ లో జరిగిన జాతీయ పోటీలలో బ్లూ మూన్ స్కూల్ విద్యార్థులు కటా విభాగంలో చందన శ్రీ గోల్డ్ మెడల్, షరణి సిల్వర్ మెడల్, సాత్విక్ బ్రాంజ్ మెడల్ సాధించారు. అదేవిధంగా కుమిత్ విభాగంలో రాహుల్ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఉమెన్స్ ఓపెన్ కుమితే గ్రాండ్ ఛాంపియన్‌షిప్ ఆంధ్రప్రదేశ్ సెకండ్ ప్లేస్‌ను కదిరి బ్లూ మూన్ జూనియర్ కాలేజీ సిరి కైవసం చేసుకుంది. బ్లూ మూన్ కాలేజీ విద్యార్థినులు కుమిత్ విభాగంలో నికిత గోల్డ్ మెడల్ సాధించింది. కటా విభాగంలో సిరి గోల్డ్ మెడల్ , నికిత బ్రాంచ్ మెడల్ సాధించారు. ఈసందర్భంగా పాఠశాల చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ బ్లూ మూన్ విద్యాసంస్థలో విద్యతో పాటు క్రీడా, కళా రంగాల్లో కూడా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. దీంతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కావలసిన అన్ని విషయాల్లో రాజీ లేకుండా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను హెచ్. ఎం మాధవరెడ్డి, సురేంద్రరెడ్డి, కరాటే మాస్టర్ షేక్షవలి, రామంజులరెడ్డి తదితరులు అభినందించారు.

ప్రతిభా విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ పరికరాలు పరిశీలన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న క్రైమ్ స్పాట్ క్లూస్ టీం ఏర్పాటుచేసిన వాహనాలను, క్రైమ్ జరిగిన సంఘటనలలో గుర్తించే పరికరాలను ఎస్పీ మాధవ్ రెడ్డి గురువారం పరిశీలించారు. జిల్లాలోని ధర్మవరం, కదిరి, పుట్టపర్తి , సబ్ డివిజన్లలో మూడు క్రైమ్ స్పాట్ క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్ సంబంధించి టీములను ఏర్పాటు చేశారు. వీటి పనితీరు తెలుసుకునేందుకు ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన వీటిని పరిశీలించారు. హత్యలు అనుమానాస్పద మృతి, దొంగతనాలు, బాంబ్ బ్లాస్టింగ్ తదితర నేరాలు జరిగినప్పుడు క్లూస్ టీం ఘటన స్థలంలో ఎవిడెన్స్ సేకరించే విధానాలు, ఫింగర్ ప్రింట్స్ పౌడర్, నేర పరిశోధనలు సాక్ష్యాధారాలను, పరికరాలను వాటి పనితీరు గురించి క్లూస్ టీం సిబ్బంది ఎస్పీకి వివరించారు. ఇప్పటివరకు జరిగిన క్రైమ్ స్పాట్ లలోక్లూస్ టీమ్ వర్క్ చేసి చేధించిన కేసుల వివరాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం అప్రమత్తంగా ఉంటూ ప్రధాన సంఘటనలు తెలిసిన వెంటనే అక్కడికి చేరుకొని ఆధారాలు సేకరించి కేసుకు బలమైన ఎవిడెన్స్ నిలిపే విధంగా పని చేయాలన్నారు. ప్రతి ఎవిడెన్స్ రికార్డులలో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఇప్పటివరకు క్రైమ్ స్పాట్స్ క్లూస్ టీం పనితీరును ఎస్పీ అభినందించారు. జిల్లాలోని ఎస్ఐలు సిఐ, డీఎస్పీలు నేరాలు జరిగిన వెంటనే ఆధారాలు తొలగిపోకుండా క్లూస్ టీం ద్వారా వెంటనే కేసు చేధించే దిశగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ సుబ్బారావు, ఫింగర్ ప్రింట్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ, తదితరులు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బుక్కపట్నం : సచివాలయ అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సత్య సాయి జిల్లా సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఒకటి, రెండు, మూడవ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ప్రజలు పలు సమస్యలపై సచివాలయాలకు వస్తూ ఉంటారని వారి సమస్యలను పరిష్కరించే దిశగా సచివాలయ అధికారులు పనిచేయాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరిపై ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు అనంతరం సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి , బుచ్చయ్య గారి పల్లి సర్పంచి రూప , ఎంపీడీవో శ్రీనివాసులు , ఈవోఆర్డీ ఇందిరాబాల, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు

పుట్టపర్తి క్రైమ్ : సత్య సాయి జిల్లాలో హనుమాన్ దర్శన్ పేరిట ఆర్టీసీ బస్సు డిపోల నుంచి 9వ తేదీన శనివారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మురిడి, నేమకల్లు, కసాపురం ఈ మూడు దేవాలయాలను దర్శించుటకు బస్సు సర్వీసును ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులు హిందూపురం, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర మండలాల డిపోల నుండి నడపనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల ముందస్తు టికెట్‌కు బస్ స్టేషన్‌లోని ఒపిఆర్ఎస్ కౌంటర్ లో కానీ, ఎటిబి ఏజెంట్ వద్ద గాని, ఎపిఎస్ఆర్టీసీ వెబ్ సైట్ లో పొందవచ్చున్నారు.

13వ వార్డులో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కోవెలకుంటపల్లి కి వెళ్లే ప్రధాన రహదారిలో వైసిపి నాయకులు అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ముళ్లకంపలతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి వెంటనే ముళ్లకంపలు తొలగించే కార్యక్రమం చేపట్టాలని నాయకులను ఆదేశించారు. దీంతో 13వ వార్డు ప్రధాన రహదారి దుర్గమ్మ గుడి నుంచి కోవెలగుట్టపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు జెసిపితో తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కె.జనార్ధన్ ఎన్. శివ సాయి ప్రసాద్, మాదినేని చిన్నకృష్ణ, ఫారెస్ట్ రేంజర్ ఆంజనేయులు, సోమశేఖర్ ఎల్. ప్రసాద్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని శ్రీ సత్య సాయి జిల్లా ఫ్యామిలీ ఫిజిషియన్ నోడల్ అధికారి డాక్టర్ సెల్వియ సాల్మన్ , జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ క్రిష్ణయ్య సూచించారు. పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిడిమామిడి గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఫ్యామిలీ ఫిజిషియన్ నోడల్ అధికారి డాక్టర్ సెల్వియ సాల్మన్ , జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ క్రిష్ణయ్య ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. 104 నందు అందించు సేవలు ల్యాబ్ పరీక్షలు గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న, ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, ఆరోగ్య కార్యకర్తలు శివ, మంజుల వాణి, ఆశా కార్యకర్తలు మామతాజ్, నిర్మల, హసినా, పార్వతమ్మ, 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి-హిందూపురం

కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తామని తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ అన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని చేపట్టిన దీక్షలు గురువారానికి 4వ రోజుకు చేరాయి. గురువారం జరిగిన కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడుతు గురునానక్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సంవత్సరాలు గడిచిన ఇంక్రిమెంట్ ఇవ్వలేదని, ఇంక్రిమెంట్ ఇవ్వాలని అడగడంతో ఎటువంటి ముందోస్తు సమారం ఇవ్వకుండా ఉన్నపళంగా పరిశ్రమను యాజమాన్యం మూసి వేసిందని అన్నారు.కార్మికుల వేతనాల్లో నుంచి కట్ చేసిన ఈఎస్ఐ, పిఎఫ్‌లను సైతం చెల్లించ లేదన్నారు. 10 సంవత్సరాలు పని చేసిన కార్మికుందరికి చట్టప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలన్నారు. ఈ సమస్యలన్ని పరిష్కరించాలని పోరాటాలు చేస్తున్న కార్మిక శాఖ అధికారుల్లో కనీస స్పందన లేదన్నారు. వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు ఎఐటియుసి నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి రెడ్డి, ఇస్మాయిల్, నారాయణరెడ్డి, అలీమ్, సురేష్, నాగేంద్ర, తుమకుంట పారిశ్రామిక వాడా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి దేవరాజు, కార్మికులు చాంద్‌బాషా, రాము తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణకు డాక్టరేట్

ప్రజాశక్తి-మడకశిర

అన్నపూర్ణ

శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామానికి చెందిన నరసింహప్ప, భాగ్యమ్మ దంపతుల కుమార్తె అన్నపూర్ణ గురువారం శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో స్టాటిస్టిక్స్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ పి.మహమ్మద్ అక్తర్ పర్యవేక్షణలో 'ఆప్టిమైజేషన్ ఆఫ్ ప్రాబబిలిటీ ఆఫ్ యాక్సెప్టెన్సీ బేస్డ్ ఆన్ ప్రిచెట్ అండ్ జనరలైజ్డ్ రేలేహ్ డిస్ట్రిబ్యూషన్స్' అంశంపై పరిశోధనలు చేశారు. అలాగే పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఈమె వ్యాసాలు ప్రచురితమవడంతో అన్నపూర్ణను ప్రొఫెసర్ పి.మహ మ్మద్ అక్తర్, ప్రొఫెసర్ కె.పుష్పాంజలి అభినందించారు. అన్నపూర్ణ డాక్టరేట్ అందుకోవడం పట్ల ఆమె తల్లిదండ్రు లతో పాటు సోదరులు శివ, కిరణ్, తాత రామప్ప హర్షం వ్యక్తం చేశారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

టిడిపి అధినేత చంద్రబాబు రాయదుర్గం నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులు పేరును ప్రకటించడం పట్ల ఆ పార్టీ మండల కన్వీనర్ బలరామ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం తెలుగు తమ్ముళ్ల టిడిపి జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

గోరంట్ల: పట్టణంలో ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాల విద్యార్థులకు డాక్టర్ శృతి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్ కుమార్, ఎఎన్ఎం విజయబాయి, అనిత, సుజాత విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

కనగానపల్లి : వైయస్సార్ పింఛన్ల కానుక కింద నూతనంగా మంజూరైన పింఛన్లను వైసిపి నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. చంద్రబాబు నాయుడు తన 14 సంవత్సరాల హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపిటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

మడకశిర : మండల పరిధిలోని ఎం రంగాపురం అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా కార్యదర్శి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఐరన్ తో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ సునీతమ్మ, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల పరిధిలో ని కంచిసముద్రం, బిసలమనేపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికహార మాసోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రెడ్డి రమణమ్మ, ఎంపిటీసీ ఆదినారాయణ, సూపర్ వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - రొద్దం

మహిళల చట్టాలపై అవగాహన సదస్సును టింబక్టివ్ కలెక్టివ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.తురకల పట్నం గ్రామంలో అనంతశక్తి సీఈఓ లావణ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహాశక్తి నుంచి రమేజా, స్వశక్తి ప్రోగ్రాంఅసోసియేట్ గౌరీ, మేనేజర్ సుకన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలవివాహాలు, గృహహింస గురించి అనంత శక్తి సొసైటీ సిబ్బంది నాటిక రూపంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహాశక్తి సొసైటీ డైరెక్టర్ క్రిష్టమ్మ, సొసైటీ న్యాయ సలహా కేంద్రం కమిటీ సభ్యులు, సొసైటీ సిబ్బంది, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

మండల పరిధిలోని బూదిలి వాండ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సింగల్ విండో అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి మృతికి నియోజకవర్గ, మండల నాయకులు నివాళులర్పించారు. పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్ రెడ్డి తదితరులు రఘునాథ్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి, శశిభూషణ్ మృతదేహానికి నివాళు లర్పించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అజంతుల్లా రంగయ్య, రామచంద్రారెడ్డి, నరేంద్ర రాయల్, మణి శేఖర్ రెడ్డి, రాజు, బాలకృష్ణ, సీనా వెంకటరమణ, బండారు బాలకృష్ణ ,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పట్నం ఎస్ఐగా ఇషాక్ బాషా

ప్రజాశక్తి - ముదిగుబ్బ

పట్నం స్టేషన్ ఎస్ఐగా ఇషాక్ బాషా గురువారం బాధ్యత స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శరత్ చంద్ర విఆర్‌కి బదిలీ అయ్యారు. విఆర్ లో ఉన్న ఇషాక్ బాషాను పట్నం స్టేషన్ ఎస్ఐగా నియమించడంతో ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. నేరాల నియంత్రణకి ప్రత్యేక చర్యలు చేపడతామని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు.

నేడు ధర్మవరంలో నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పురపాలక సంఘ పరిధిలోని నీటి సరఫరాకు సంబంధించిన తమ్మాపురం వాటర్ వర్క్స్ నందు పైప్ లైన్ లీకేజీ మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం ధర్మవరంలో నీటిసరఫరాను బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నామని ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రయివేటు జూనియర్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులుగా భక్తవత్సలం

ప్రజాశక్తి - గోరంట్ల

భక్తవత్సలం

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులుగా పెద్ద రాసు భక్తవత్సలం ఎంపికయ్యారు. నూతన అధ్యక్షులుగా ఎంపికైన భక్తవత్సలం గోరంట్ల పట్టణంలో ఎస్వీవీఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా ఉన్నారు. జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ కమిటీ గౌరవ అధ్యక్షులుగా అనంతపురానికి చెందిన శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ గా సీతారామయ్య, సెక్రటరీగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా రమణ, జాయింట్ సెక్రటరీగా చంద్రశేఖర్, శివ శంకర్, నరేంద్ర కుమార్, ఈసీ మెంబర్లుగా నరసింహమూర్తి, రాము, మధుసూదన్, భగవంతు రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షులు భక్తవత్సలం తెలిపారు.

'ఉపాధి'కి అవినీతి చెదలు

ప్రజాశక్తి మడకశిర రూరల్

మడకశిర మండలంలో ఉపాధి పథకాన్ని అవినీతి చెదలు అంటుకున్నాయి. దీంతో పనులు జరగక కూలీలకు పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మడకశిర మండలంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి కారణంగా ఉపాధి పనులు జరగడం లేదు. దీనికంతటికీ ఈ పథకంలో పనిచేసే ఓ కంప్యూటర్ అసిస్టెంట్ నిర్లక్ష్యంతో పాటు ఒక టెక్నికల్ అధికారి చేతివాటం కారణమన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఈ వారం ఉపాధి హామీ పథకం కూలీలకు మెజర్మెంట్ చేయకుండా టెక్నికల్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఉపాధి కూలీలు పనులకు నోచుకోక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంత జరుగుతున్న మండల అధికారులు కానీ జిల్లాస్థాయి అధికారులు కానీ స్పందించడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఈతతంగంపై జిల్లా స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి బాధ్యులైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'జనబాట'లో సమస్యలు ఏకరువు

జనబాట కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి కదిరి టౌన్

జనసేన చేపట్టిన జనసేన జన బాట కార్యక్రమంలో ప్రజలు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను నాయకుల ఎదుట ఏకరువు పెట్టుకున్నారు. ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని 6వ వార్డు కందికుంట నారాయణమ్మ కాలనీలో జన బాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాలకుల చేతకానితనానికి , అసమర్థ పాలనకు , నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి కందికుంట నారాయణమ్మనగర్ లో నెలకొని ఉన్న సమస్యలే నిదర్శనం అని అన్నారు. నేటికీ కాలనీలోకి వెళ్ళడానికి ఒక్క సిమెంట్ రోడ్డు లేదన్నారు. వీధి దీపాలు, మురుగుకాలువలు లేవన్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా సరిగా లేదని విమర్శించారు. అంతే కాకుండా మైన్స్ కోసం తూటాలు పేల్చడం వల్ల ఆ ధ్వనులతో కొత్తగా ఇంటి నిర్మాణం చేసుకుంటున్న గోడలు సైతం పగుళ్లు వస్తున్నాయని కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి కదిరి పట్టణాన్ని అంతర్జాతీస్థాయిలో స్మార్ట్ టౌన్ గా తీర్చి దిద్దుతానని చిలుకపలుకులు పలుకుతున్నారని విమర్శించారు. నాలుగు చినుకులకే కందికుంట నారాయణమ్మ నగర్ లోకి రాలేని పరిస్థితి ఉందన్నారు. ఏర్పడింది.మునిసిపల్ చైర్మన్ , కౌన్సిలర్లు ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసుకొని టీ , కాఫీ , బిస్కెట్ , సమోసా తిని కాలయాపన చేస్తున్నారు తప్ప కదిరి పట్టణ ప్రజల సమస్యలపై ఏమాత్రం దష్టి పెట్టలేకపోతున్నారని , ఎక్కడ చూసిన కుక్కల బెడద , దోమల బెడద,కాలువల్లో పేరుకుపోయిన పూడికను సకాలంలో తొలగించక పోవడం వల్ల వర్షపు నీరు ఇండల్లోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు మునిసిపల్ కమిషనర్ కి వినతులు పంపించినా పట్టించుకోలేదని కదిరి నియోజకవర్గం ఇంచార్జ్ భైరవ ప్రసాద్ గారు జనసేన జన బాట కార్యక్రమంలో తిరుగుతూ స్థానిక ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కాయల చలపతి, లక్ష్మణ కుటాల, కిన్నెర మహేష్, అంజిబాబు, గుంతా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వినియోగదారులకు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోతులనాగేపల్లి గన్న లేఅవుట్ల వద్ద రూ.2.50కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యుత్ సబ్ స్టేషన్లో నూతనంగా అమర్చిన పరికరాలను, సప్లై చానల్ను పరిశీలించి ప్రజలకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోతులనాగేపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీలలో 6,700కు పైగా ఇళ్లను నిర్మించడం జరుగుతోందన్నారు. వీరందరికి విద్యుత్ సరఫరాలో ఏ ఇబ్బంది. లేకుండా ఉండేందుకు 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్‌ను రూ.2.50 కోట్ల వ్యయంతో ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా జగనన్న కాలనీలకే కాకుండా రూరల్ పరిధిలోని పోతుల నాగేపల్లి, తుంపర్తి, మోటును సీసీకొత్తకోట తదితర ప్రాంతాలలోని రైతాంగానికి నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. గతంలో ఈ ప్రాంతాలకు ఎర్రగుంట విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుండటంతో లోడ్ ఎక్కువై రైతులు, ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ఈ సమస్యకు పూర్తిగా పరిష్కారం చూపించడానికే సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా నియోజకవర్గంలో కొత్తగా 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లను గొట్లూరు, బత్తలపల్లి మండలం ఆప్రాచెరువు, ముదిగుబ్బ మండలం దొరిగిల్లు ప్రాంతాలలో నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్ బేగం, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఇ సురేంద్ర, ఈఈ రమేష్, డీఈఈ కిరణ్ కుమార్, డీఈఈ కనక్షన్ శ్రీకాంత్‌రెడ్డి, రూరల్ ఏఈ జానకిరామయ్య, ఏఈలు కొండారెడ్డి, నాగభూషణ, నజీరుద్దీన్‌తో పాటు పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మానపల్లి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

గ్రామసభలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి

ప్రజాశక్తి బత్తలపల్లి

భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకానికి శ్రీకారం చుట్టిందని వైస్ ఎంపీపీ గజ్జలవెంగళరెడ్డి, సర్పంచులు చల్లా కరుణాకర్ నాయుడు, మాచిరెడ్డి పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని దంపెట్ల గ్రామ సచివాలయంలో రీ సర్వే నిర్వహణపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్యాక్రాంతమైన భూములు, భూ పంపకాలు. రికార్డుల్లో ఉన్న తేడాలు, సరిహద్దుల మార్పు చేర్పులను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ లోపాలన్నీ సరిచేసి భవిష్యత్తులో భూ తగాదాలు లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఆదేవిధంగా వలంటీర్లు కూడా వారి పరిధిలోని భూమి గల రైతులకు భూసర్వే గురించి తెలియజేయాలని సూచించారు. ఈ గ్రామసభలో కార్యదర్శి భారతి, విఆర్డీఓ నరసింహులు, సర్వేయర్ రవి, సచివాలయ ఉద్యోగులతో పాటు వైసిపి నాయకులు చెన్నారెడ్డి, కృష్ణమూర్తి, ఓబులయ్య, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో యజమానులకు 'భూరక్ష' : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా చేపడుతున్న రీ సర్వేతో యజమానుల ఆస్తికి మరింత భద్రత ఉంటుందని తహశీల్దార్ యుగేశ్వరిదేవి అన్నారు. మండలంలో జరుగుతున్న భూ సర్వేలో భాగంగా గురువారం డి. చెర్లోపల్లి, సంగాల రెవెన్యూ గ్రామాల్లో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందేళ్ల తర్వాత రీసర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. భూమి, రెవెన్యూ రికార్డులను అనుసంధానం చేయడానికి సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. సర్వే కోసం లబ్దిదారులు ఆర్జీ ఇవ్వకపోయినా సర్వే నిర్వహణ, యాజమాన్యపు హక్కు నిర్ధారణ రికార్డుల్లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించి భూసర్వే చేయించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు నాగేంద్ర, విష్ణు, విఆర్ఏలు, రైతులత పాటు వైసిపి నాయకులు గుజ్జల ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కృష్ణుడి వేషధారణలో హాయాన్స్

ప్రజాశక్తి - మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు. గుర్రపుకొండ గ్రామానికి చెందిన భవ్య మంజునాథ్ కుమారుడు హాయాన్స్ ప్రత్యేక వేషధారణతో ప్రజలను ఆకర్షించారు.

ఓబుల దేవర చెరువు : స్థానిక రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు ఎం .జయ సింహ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట

మండల కేంద్రంలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుని వేషధారణతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె మహేష్, ఉపాధ్యాయులు మల్లికార్జున, రాజశేఖర్ రెడ్డి, నజీర్‌బాషా, ఆంజనేయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

ముదిగుబ్బ : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గ్రామోత్సవాన్ని మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ప్రతిరూపాన్ని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

ముదిగుబ్బలో కృష్ణాష్టమి వేడుకలు

నల్లచెరువు : కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక గీతా మందిరంలో గురువారం కందికుంట నారాయణమ్మ ట్రస్ట్ చైర్మన్ కందికుంట యశోదమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ కన్వీనర్ దాదం శివారెడ్డి, పాలపాటిదిన్నె ఆలయ కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్ రెడ్డి, దేవళం వేణు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని కోవెలకుంటపల్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఉట్టికొట్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాస్య అనే యువతి కృష్ణుని వేషధారణలో ఉట్టి కొట్టి రూ. 1116 గెలుచుకుంది. అనంతరం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.